క్లుప్తంగా

నేడు రేగోడ్‌కు మంత్రి రాక

రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం రానున్నట్లు పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి శుక్రవారం తెలిపారు. టి.లింగంపల్లి, ప్యారారం, పోచారం, మర్పల్లి, కొండాపూర్, జగిర్యాల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తారని చెప్పారు. రేగోడ్‌లో మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో ఆయా పనుల నిర్మాణానికి పూజ చేస్తారని చెప్పారు.

వైకుంఠ రథం బహూకరణ



వైకుంఠరథాన్ని జీపీ ప్రతినిధులకు అందిస్తున్న పరిశ్రమల ప్రతినిధులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారం గ్రామ పంచాయతీకి గర్గ్ స్టీల్ పరిశ్రమల యజమాన్యం వైకుంఠరథం, ఫ్రీజర్‌బాక్స్‌ను శుక్రవారం అందించారు. కార్యక్రమలంలో ఎంపీడీఓ ప్రవీణ్, గ్రామ కార్యదర్శి సుహాసిని, ఏపీఓ గిరిధర్‌రెడ్డి, గర్గ్ పరిశ్రమ ఎండీ అశీస్ అగర్వాల్, దేవి పరిశ్రమల ప్రతినిధులు వాహిద్ పాల్గొన్నారు.

సన్మానం



డిప్యూటీ తహసీల్దార్ కౌశికను సన్మానిస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాలకు నియమించిన నూతన ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రం మనోహరాబాద్, కొండాపూర్‌లో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ కాళ్లకల్, పాలటలో ఎంపీఓ సతీశ్, కూచారం, చెట్లగౌరారంలో ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, పర్కిబండ, గౌతోజీగూడెంల్లో డిప్యూటీ తహసీల్దార్ కౌశిక బాధ్యతలు చేపట్టారు. లింగారెడ్డిపేట్, రంగాయపల్లిల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, రామాయపల్లి, కోనాయపల్లి(పీటీ)ల్లో మండల వెటర్నరీ వైద్యురాలు రమాలక్ష్మి, వెంకటాపూర్ అగ్రహారం, పోతారంల్లో ఇరిగేషన్ ఏఈ అధికారి అనూరాధ, ముప్పిరెడ్డిపల్లి, దండుపల్లిల్లో మండల వ్యవసాయ అధికారి స్రవంతి, జీడిపల్లిలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి తదితరులు బాధ్యతలు స్వీకరించారు.

వ్యాక్సిన్ తప్పనిసరి



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): గొర్రెలు షిప్ వాక్స్ నివారణ కోసం వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఫర్హీన్ ఫాతిమా గొర్రెల యజమానులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అసిస్టెంట్ సర్జన్ ఫాతిమా గొర్రెలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గొర్రెలను షిప్ వాక్స్ వల్ల నోట్లో పొక్కులు రావడం, సొల్లు కార్చడం వంటి లక్షణాలతో పాటు ఆకలి మందగించి గొర్రెలు చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ గట్టయ్య, సిబ్బంది ప్రవీణ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మక్కరాజీపేటలో స్వయంపాలన



ఉపాధ్యాయులతో విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపరిపాలనను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ఎం అమరేశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, పాండు తదితరులు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి తండాకు చెందిన నేనవత్ శాంతి(45) జనవరి 27న ఎస్.కొండాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భర్త చందర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని శవపంచనామ నిర్వహించిట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

సర్పంచ్‌ల సేవలు మరువలేనివి



కాడిపల్లి(నర్సాపూర్): కూకుట్లపల్లిలో పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



కాడిపల్లి(నర్సాపూర్): నాగ్సాన్‌పల్లిలో సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం



నర్సాపూర్‌రూరల్: పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నర్సాపూర్‌రూరల్: సర్పంచ్‌ల సేవలు మరువలేనివని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. పంచాయతీ పాలకమండలి కాలపరిమితి ఇటీవలే ముగిసింది. గ్రామానికి, పాఠశాలకు చేసిన అభివృద్ధి సహకారాన్ని గుర్తించిన పాఠశాలల ఉపాధ్యాయులు మాజీ పాలకమండలి సభ్యులను పాఠశాలలో సన్మానించారు. గ్రామంలో కానీ, పాఠశాలలో కానీ మాజీ సర్పంచ్ శివకుమార్‌తో పాలకమండలి సభ్యులు కృషి అమోగమని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ.. గ్రామానికి సేవ చేసే అవకాశం దొరకడం తన అదష్టమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్, బలమని, నాగభూషణం, మాజీ ఉపసర్పంచ్ కదారి నాగరాజు, మాజీ వార్డు సభ్యులు వాణి, అంజమ్మ, నిల, మల్లేశ్‌గౌడ్, ప్రసాద్, దుర్గేశ్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

కౌడిపల్లి(నర్సాపూర్): సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో మండలంలోని కూకుట్లపల్లి, నాగ్సాన్‌పల్లి, దేవులపల్లి, కంచన్‌పల్లి తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు సుజాత, ఎల్లం, ప్రమీళ, రజినీ, వార్డు సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి పాటుపడ్డ పాలక వర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో నరహరి, శ్రీహరి, అనీల్, పాష, నీరుడి కుమార్, జెజ్జరి వెంకన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి నిధులు మంజూరు

పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు

రామాయంపేట(మెదక్): నియోజకవర్గం పరిధిలోని అన్ని గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతీ మండలానికి రూ. కోటిన్నర నిధులు మంజూరైనట్లు పీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. వారు శుక్రవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. నాలుగైదు రోజుల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ స్వయంగా పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈనెల 6న నిర్వహించ తలపెట్టిన చలో సిద్దిపేట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మెదక్ నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనకబడిపోయిందని, రామాయంపేటకు మంజూరైన నిధులను సైతం మాజీ మంత్రి హరీశ్‌రావు తరలించుక పోయారని ఆరోపించారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఓబీసీ సెల్ పట్టణాధ్యక్షుడు స్వామి, జిల్లా నాయకుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాకి స్వామి, తిరుపతిరెడ్డి, వినయ్‌సాగర్, సాకేత్‌రెడ్డి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

ఏడీఏ పుణ్యవతి



గోదాంను పరిశీలిస్తున్న ఏడీఏ పుణ్యవతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. శుక్రవారం ఆమె మండల వ్యవసాయ అధికారి బాల్‌రెడ్డితో కలసి మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని రైతు ఆగ్రో సేవా కేంద్రం, పీఏసీఎస్ గోదాములను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఈపీఓఎస్ మిషన్‌లో, గోదాముల్లో ఉన్న స్టాక్‌లో ఎలాంటి తేడా ఉండకూడదన్నారు. అదేవిధంగా లైసెన్స్, ఓ ఫామ్ ఉన్న కంపెనీ ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు. నకిలీ ఎరువులు అమ్మితే చర్యలు తప్పవన్నారు. బిల్‌బుక్‌లు, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు శ్రీనివాస్, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాగు చేయాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ సాగులో రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దగొట్టిముక్లలో యంత్రం ద్వారా వరి నాటు విధానం క్షేత్రస్థాయిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ వరి యంత్రం ద్వారా నాటు వేస్తే ఖర్చులు గణనీయంగా తగ్గించుకోవచ్చునని అన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మజీద్, రైతులు మురళీధర్‌రెడ్డి, మహీంద్రా, ఏరియా మేనేజర్ దామోదర్, చంద్రయ్య, తదితరులు ఉన్నారు.

మట్టి అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు



సీజైన టిప్పర్లు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి శుక్రవారం అన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని కొండాపూర్ శివారులో గురువారం అర్ధరాత్రి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు అక్కడ వెళ్లగా, మట్టిన రవాణా చేస్తున్న 4 టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోషక ఆహారంపై అవగాహన అవసరం



ఆహారాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులకు వంట ప్రాముఖ్యత, తినాల్సిన పోషక ఆహారంపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని మండల నోడల్ అధికారి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి, మండల వ్యవసాయ అధికారి స్రవంతి, మాజీ సర్పంచ్ ప్రభావతి, నాయకులు పెంటన్న, హెచ్ఎం ప్రమోధిని, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు



రామాయంపేట(మెదక్): బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రజనికుమారి

రామాయంపేట(మెదక్): మండలంలోని పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కోనాపూర్, అక్కన్నపేటకు తహసీల్దార్ రజనికుమారి, ప్రగతి ధర్మారం, ఝాన్సిలింగాపూర్‌కు ఎంపీడీఓ ఉమాదేవి, కాట్రియాల, దామరచెరువుకు మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, రాయిలాపూర్, లక్ష్మాపూర్‌కు ఎంపీఓ గిరిజారాణి ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. ఆర్ వెంకటాపూర్, తొనిగండ్లకు నీటిపారుదల శాఖ ఏఈ కుషాల్, దంతేపల్లి, సుతారిపల్లికి వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, పర్వతాపూర్, శివ్వాయపల్లికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్ కుమార్, కిషన్‌తండాలకు పంచాయత్‌రాజ్ ఏఈ శరత్ పవన్ బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాలకు ప్రత్యేక అధికారుల నియామకం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవడంతో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

సంక్షిప్త వార్తలు

◆ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



పాపన్నపేట(మెదక్): మండలంలోని కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం పరిధిలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద నూతనంగా బిగించిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం సొసైటీ చైర్మన్ రమేశ్ ప్రారంభించారు. ఏడుపాయల మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

◆ పాపన్నపేట ఎస్ఐగా నరేశ్



పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఎస్ఐగా నరేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ మహిపాల్‌రెడ్డి శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

◆ ఆటోని ఢీ కొట్టిన డీసీఎం

శివ్వంపేట(నర్సాపూర్): ఆటోని డీసీఎం ఢీ కొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం తూప్రాన్ – నర్సాపూర్ హైవేపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ నుంచి శివ్వంపేటకు వస్తున్న ఆటోని దొంతి గ్రామ శివారు వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న పాంబండకు చెందిన చింతకాయ పోచమ్మ, దొంతి గ్రామానికి చెందిన విద్యార్థులు మధు, వినయ్‌లకు గాయాలయ్యాయి.

◆ సన్మానం

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీనివాస్‌చారిని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, షేక్‌ఆలీ, మల్లేశ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రాజుగౌడ్, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

◆ బాధ్యతల స్వీకరణ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మేజర్ పంచాయతీ, సంకాపూర్ ఎల్‌టీ ప్రత్యేక అధికారిగా ఏపీఓ నరేశ్‌కుమార్ బాధ్యతల్లో చేరారు. అలాగే శేరిపల్లి, నర్సంపల్లి ప్రత్యేక అధికారిగా ఏఓ యాదగిరి, జప్తి శివనూర్‌కు ఎంపీడీఓ ఆనందమేరి, వల్లూర్, పెద్ద తండాకు తహసీల్దార్ కరీం, సంకాపూర్, బీమ్‌రావుపల్లికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వప్న బాధ్యతల్లో చేరారు.

క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేసి ప్రవేశిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సునీతారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా పూర్ణాహుతి, హోమం, ప్రవేశ పూజ నిర్వహించి క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు పంబల భిక్షపతి, శేఖర్, కుమ్మరి నగేశ్, ఆంజనేయులు గౌడ్, కౌన్సిలర్లు రామచందర్, మహమ్మద్ షరీఫ్, షేక్ హుస్సేన్, సుధాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి రుణాలు చెల్లించండి



నానో యూరియాను చూపుతున్న చైర్మన్, డైరెక్టర్లు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రాథమిక సహకార సంఘం నుంచి తీసుకున్న ఎల్‌టీ బకాయి రుణాలు చెల్లించాలని శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి అన్నారు. శుక్రవారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. శివ్వంపేట సహకార సంఘం నుంచి ఎల్‌టీ రుణాలు 80 లక్షలకు పైగా మొండి బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లిస్తే కొత్త రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు బకాయి రుణాలు చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియా వాడకం దగ్గించాలనే సంకల్పంతో నానో యూరియా అందుబాటులో ఉంచామని డ్రోన్ల ద్వారా పిచికారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ విజయలక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణకర్, సీఈఓ మధు, డైరెక్టర్లు యాదగౌడ్, సునీత, పెంటాగౌడ్, అంజిరెడ్డి, నర్సింలు, వీరస్వామి, కమల, బలవంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

మగ్గంవర్క్ శిక్షణతో ఉపాధి

డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ



మగ్గవర్క్ శిక్షణను ప్రారంభిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): నాబార్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మగ్గం వర్క్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ కోరారు. శుక్రవారం మండలంలోని సూరారం గ్రామంలో నాబార్డ్, ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గంవర్క్‌పై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు అవసరమైన మిషన్ కొనుగోలుకు రుణం అందించి సహకరిస్తానని తెలిపారు. నాబార్డ్ శిక్షకులు శ్వేత, గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు 20 రోజుల్లో మగ్గం వర్క్ చేసేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. మగ్గం వర్క్ నేర్చుకున్న మహిళలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత కూడా డిజైన్స్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఓ లక్ష్మీనారాయణ, తాజా మాజీ సర్పంచ్ నీరజగౌడ్, సీసీ నాగరాజు, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు మాధవి, ఉర్మిల పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి సబ్‌డివిజన్ పోస్టల్‌శాఖ మెయిల్ ఓవర్సీస్ డి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని పోస్టాఫీస్ కార్యాలయం వద్ద ఖాతాదారులకు పోస్టల్‌శాఖ ద్వారా అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి బీమా పథకాలు, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. పాలసీలపై గ్రామాలలో బీపియంలు ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌పీయం రఘు, బీపీఎంలు ప్రశాంత్, గంగారం, మాణయ్య, సిబ్బంది తుకారం, సుదర్శన్, సవిత తదితరులు ఉన్నారు.

పేట ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ ప్రవీణ్



చిన్నశంకరంపేటలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు 17 మంది ప్రత్యేక అధికారులను నియమించారు. చిన్నశంకరంపేట, అంబాజీపేట గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ ప్రవీణ్ శుక్రవారం బాధ్యతల్లో చేరారు. అలాగే శాలిపేట, మిర్జాపల్లి ఎల్‌టీకి తహసీల్దార్ మన్నన్, సూరారం, చెన్నాయిపల్లికి ఎంపీఓ గిరిధర్‌రెడ్డి, మిర్జాపల్లి, మల్లుపల్లికి ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, కొర్విపల్లి, జంగరాయి ఎల్‌టీకి ఆర్‌అండ్‌బీ ఏఈ విజయ సారధి, గవ్వలపల్లి, గజగట్లపల్లికి ఏఓ లక్ష్మీ ప్రవీణ్, మడూర్ బాధ్యతలు చేపట్టారు. ఖాజాపూర్ ఎల్‌టీకి వెటర్నరీ డాక్టర్ గీతామాలిక, జంగరాయి, ఖాజాపూర్‌కు పీఆర్‌ఏఈ విజయ్‌కుమార్, చందంపేట, గవ్వలపల్లి ఎల్‌టీకి ఎంపీపీ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ విధుల్లో చేరారు. ఎస్.కొండాపూర్, సంగాయిపల్లి, వెంకట్రావుపల్లికి డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌గౌడ్, చందాపూర్, ధరిపల్లికి ఏఎస్ఓ కృష్ణ, భాగిర్థిపల్లికి ఎస్‌డబ్ల్యూఓ సత్యనారాయణ, కామారంకు మిషన్ భగీరథ ఏఈ తిరుమలేశ్, కామారం ఎల్‌టీకి పద్మావతి, రుద్రారం, వెంకటేశం, టీ.మాందాపూర్‌కు సాయినిఖిల, టీ.మాందాపూర్ ఎల్‌టీకి శివరామ్ బాధ్యతలు స్వీకరించారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ కలెక్టరేట్: వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం ఆరోపించారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ వ్యవసాయ కార్మికులకు బడ్జెట్ కేటాయింపులో చవతి తల్లి ప్రేమ చూపించిందని మండిపడ్డారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టాన్ని పార్లమెంట్‌లో తీసుకురావాలని తెలిపారు. గ్రామీణ ఉపాధిహామీ పనులను పట్టణ ప్రాంతాల విస్తరించాలని, వంద రోజుల పనులను 200 రోజులకు పెంచి రోజు కూలి రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు విస్తరింపజేయాలని ప్రతిపాదనను ఆర్థిక శాఖ మంత్రి పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.